క్లుప్తంగా

మాజీ కౌన్సిలర్‌కు పరామర్శ



పెబ్బేరు రూరల్: వనపర్తి పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ ఆవుల రమేష్ రోడ్డు ప్రమాదంలో గాయపడి, చికిత్స చేయించుకున్నారు. ఈ నేపథ్యంలో ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి బుధవారం పరామర్శించి, యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ గట్టుయాదవ్, మాజీ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, నందిమళ్ల అశోక్, మాధవరెడ్డి, నరేష్, సంతోష్ పాల్గొన్నారు.

అర్హులకే ప్లాట్లు కేటాయిస్తాం



పాన్‌గల్: మల్లాయిపల్లిలో ఎస్సీ, బీసీలకు ప్లాట్ల కోసం కేటాయించిన సర్వే నెం.423లోని స్థలాన్ని బుధవారం తహసీల్దార్ సుభాష్‌నాయుడు పరిశీలించారు. కొందరు పట్టాలు లేకున్నా ఆ స్థలాన్ని అక్రమించుకొని ఇళ్లు నిర్మించుకుంటున్నారనే ఫిర్యాదు మేరకు విచారణ చేపడుతున్నామన్నారు. ప్లాట్ల స్థలంపై గ్రామస్తులతో తహసీల్దార్ ఆరా తీశారు. ప్రభుత్వం నుంచి పట్టాలు మంజూరు అయ్యే వరకు ఎవరు కూడా ఈ స్థలంలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టకూడదని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

‘భగీరథ’ సర్వే పరిశీలన



పాన్‌గల్: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న మిషన్ భగీరథ ఇంటింటి సర్వేను బుధవారం ఎంపీడీఓ కోటేశ్వర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి సర్వేను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. సర్వేలో ప్రతి ఇంటికి అవసరాలకు సరిపడా భగీరథ నీరు అందుతుందా.. లేదా, నల్లా కనెక్షన్లపై ఆరా తీస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ రఘురాములు, పంచాయతీ కార్యదర్శి రఘు పాల్గొన్నారు.

హెల్త్ సెంటర్‌లో వసతులు మెరుగు



వీపనగండ్ల: రాష్ట్ర ప్రభుత్వం కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు త్వరలోనే వైద్యులతో పాటు వసతులను సమకూర్చనుందని జిల్లా సామాజిక ఆరోగ్య కేంద్రాల సూపరింటెండెంట్ చైతన్యగౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలో ఆత్మకూరు, ఖిల్లాఘనపురం, వీపనగండ్ల, రేవల్లి మండల కేంద్రాల్లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో అవసరమైన వైద్యుల నియామకం కోసం ప్రతిపాదనలను తెలంగాణ వైద్య విధాన పరిషత్‌కు పంపించినట్లు ఆయన తెలిపారు. గ్రామస్తులు సహకరించి ఆస్పత్రి పరిసరాలు కలుషితం కాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో సెంటర్ ఇన్‌చార్జ్ ప్రియాంక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

ఖిల్లాఘనపురం: మండలంలోని సోళీపురంలో ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన మహేష్ (26) కుటుంబాన్ని బుధవారం రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి, ఆయన సతీమణి జిల్లెల రమాదేవి, కుమారుడు జిల్లెల ఆదిత్యారెడ్డి బుధవారం పరామర్శించారు. కన్నీటి పర్యతమైన బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుడి కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని భరోసానిచ్చారు. మహేష్ కొన్నేళ్లుగా ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి ఇంటి వద్ద పని చేస్తు ఉండేవాడు. అతడు మృతి చెందిన విషయం తెలుసుకున్న చిన్నారెడ్డి కుటుంబ సభ్యులు దహన కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్, దేవన్న, బాల్‌రెడ్డి, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.





చిట్యాల పాఠశాలలో జెడ్పీ సీఈఓ యాదయ్య



అమరచింత జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



వెల్టూర్ జెడ్పీహెచ్ఎస్‌లో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

సర్కార్ బడుల్లో మెరుగైన విద్య

కొత్తకోట రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. వేసవి సెలవులు పూర్తవడంతో బుధవారం పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో పెద్దమందడి మండలంలోని వెల్టూర్‌లో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే రాక సందర్భంగా గ్రామస్తులు, పాఠశాల ఉపాధ్యాయ బృందం ఘనస్వాగతం పలికారు. పాఠశాల ఆవరణలో గల సరస్వతి విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో మౌళిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ రఘుప్రసాద్, జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ సద్గుణ, హెచ్‌ఎం సురేష్‌సాగర్ తదితరులు ఉన్నారు.

కొత్తకోటలో..

పట్టణంలోని ఉర్దూమీడియం స్కూల్ పునః ప్రారంభానికి దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా వసతులు సమకూర్చుతున్నామని తెలిపారు. అనంతరం విద్యార్థులకు యూనిఫాం, రాత, పాఠ్య పుస్తకాలను అందజేశారు. అనంతరం పాఠశాల అభివృద్ధికి తనవంతు సహాయంగా రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ మానిటరింగ్ అధికారి యుగంధర్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రవీందర్‌బాబు, హెచ్‌ఎం కుర్మయ్య తదితరులు ఉన్నారు.

రామకృష్ణాపురంలో..

రామకృష్ణాపురం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం మురళీకృష్ణ అందరిలా కాకుండా భిన్నంగా ఆలోచించి పాఠశాలలో నూతనంగా చేరిన ప్రతి విద్యార్థికి ఒక మొక్కను ఇచ్చి స్వాగతం పలికారు. గ్రామస్తులు, విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి ఉపాధ్యాయ బృందం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. జెడ్పీహెచ్ఎస్ పామాపురంలో 10వ తరగతి పూర్తి చేసి మంచి ఫలితాలు సాధించిన ముగ్గురు విద్యార్థులకు ఉపాధ్యాయురాలు రేవతి తన తండ్రి జ్ఞాపకార్థం ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున బహుమతిగా అందజేశారు.



కొత్తకోట ఉర్దూ మీడియం పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు ఇస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి



రామకృష్ణాపురం ప్రాథమిక పాఠశాలలో..



తిర్మలాయపల్లిలో ..

అమరచింత: రాష్ట్రంలో ప్రభుత్వ బడుల్లో మౌళిక వసతుల కల్పనతో పాటు పాఠశాలల అభివృద్ధికి రూ.1,600 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేస్తుందని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీఉన్నత, బాలికల ఉన్నత పాఠశాల, డీఎంఆర్‌ఎం ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ బడులను ఆదరించి, ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కోరారు.

తరగతి గదుల అపరిశుభ్రతపై అసహనం

పాఠశాల పునఃప్రారంభ కార్యక్రమంలో పాల్గొనేందుకు జెడ్పీ ఉన్నత పాఠశాలకు వచ్చిన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అక్కడే ఉన్న తరగతి గదులను పరిశీలించారు. తరగతి గదులు అపరిశుభ్రంగా, దుమ్ము, దూళిలో కనిపించడంతో ప్రధానోపాధ్యాయుడు బలరాంపై అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, జెడ్పీటీసీ మార్క సరోజ, ఎంఈఓ భాస్కర్‌సింగ్, తహసీల్దార్ చాంద్‌పాషా, పీఆర్ ఈఈ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు బలరాముడు, కరుణాకర్, బాలస్వామి, డీసీసీ ప్రధాన కార్యదర్శి అయూబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: మున్సిపాలిటీతో పాటు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, చైర్‌పర్సన్ గాయత్రి, ప్రత్యేకాధికారి సుబ్బారెడ్డి, తహసీల్దార్ రాజు, ఎంపీడీఓ సుజాత, ఎంఈఓ భాస్కర్‌సింగ్ సందర్శించి విద్యార్థులకు యూనిఫాంలు, రాత, పాఠ్య పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కోటేష్, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: కల్వరాల పాఠశాల పునఃప్రారంభానికి ఎంపీడీఓ శ్రీనివాసరావు హాజరై విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులను అందించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, వెంకటేష్, గ్రామ మహిళా సంఘం అధ్యక్షురాలు కాంతమ్మ, విద్యా కమిటీ చైర్‌పర్సన్ చిట్టెమ్మ, రాములు, గిరిధర్‌గౌడ్, భరత్‌చారి పాల్గొన్నారు.

పాన్‌గల్: మండలంలోని దొండాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో మండల ప్రత్యేకాధికారి స్వరణ్‌సింగ్, ఎంపీడీఓ కోటేశ్వర్, ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, ఏపీఎం సక్రూనాయక్, ఏఈ కవిరెడ్డి విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రాధాకృష్ణ, అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ సుగుణ, తల్లిదండ్రులుపాల్గొన్నారు.

చిన్నంబావి: మండలంలోని అమ్మాయిపల్లి, వెలగొండ, దగడపల్లి, పెద్దదగడ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేకాధికారి రఘునాథ్‌రెడ్డి, ఎంపీడీఓ రమణరావు పాఠ్యపుస్తకాలను అందించారు.

మదనాపురం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం ఎంపీపీ పద్మావతి విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో జగదీష్, రేణుక, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని చిట్యాల ప్రాథమిక పాఠశాలలో జిల్లా పరిషత్ సీఈఓ యాదయ్య విద్యార్థులకు నోట్, రాత పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గణేష్‌కుమార్, ఎంపీడీఓ రాఘవ, పంచాయతీ కార్యదర్శి పూర్ణచంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూనిఫాం, పుస్తకాల పంపిణీ

పెబ్బేరు మండలంలోని కంచిరావుపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎంపీపీ ఆవుల శైలజ, ఎంఈఓ జయరాములు ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులకు నోట్, రాత పుస్తకాలు, యూనిఫాం అందజేశారు. పెబ్బేరు పట్టణ కేంద్రంలోని చెంచువాడ ప్రాథమిక పాఠశాలలో మున్సిపల్ చైర్మన్ ఎద్దుల కరుణశ్రీ, వైస్ చైర్మన్ కర్రెస్వామి, సింగిల్ విండో చైర్మన్ కోదండరామిరెడ్డి, ఎంఈఓ జయరాములు పాల్గొని విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం అందజేశారు. శ్రీరంగాపురం మండలంలోని నాగసానిపల్లి ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజేంద్రప్రసాద్, తహసీల్దార్ మురళీగౌడ్, ఎంపీడీఓ రవీంద్ర పాల్గొని విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు.

ఖిల్లాఘనపురం: మండలంలోని తిర్మలాయపల్లి, తదితర పాఠశాలల్లో మండల ప్రత్యేక అధికారి డీటీడీఓ శ్రీనివాసులు, ఎంపీడీఓ వెంకటాచారి, ఎంఈఓ ఉషారాణి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ రాజు తదితరులు పాల్గొన్నారు.



కంచిరావుపల్లి పాఠశాలలో..



పెద్దగడలో..



ఆత్మకూర్‌లో..



కొత్తకోటలో..



మదనాపురంలో ఎంపీపీ



శ్రీరంగాపురం మండలంలోని నాగసానిపల్లిలో..



వీపనగండ్ల మండలంలోని కల్వరాలలో..



పాన్‌గల్‌లో..



ఖానాపూర్‌లో..

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

పెబ్బేరు రూరల్: కొత్త విద్యా సంవత్సరం ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్, రమేష్, గోపాలకృష్ణ అన్నారు. విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వారు బుధవారం వనపర్తి కలెక్టర్ కార్యాలయంలో విద్యా శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ విజయలక్ష్మికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు ఒక జత యూనిఫాం, 70 శాతం విద్యార్థులకు మాత్రమే కొత్త పుస్తకాలు పంపిణీ చేస్తూ.. మిగతా 30 శాతం విద్యార్థులకు పాత పుస్తకాలు శరణ్యమే అన్నారు. విద్యా రంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. 2024–25 విద్యా సంవత్సరం బుధవారం నుంచి ప్రారంభం అయిందని, పాఠశాలలో ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులకు పాఠాలు ఎవరు బోధించాలని ప్రశ్నించారు. ఇటీవల కాలంలో కొత్తగా రెండు కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలలు అనుమతి లేకుండా అడ్మిషన్లు మూడు నెలల నుంచి జరుపుతున్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లను ఉచితంగా ఇవ్వాలన్న నిబంధనలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు లక్ష్మీనారాయణ, మైబూసి తదితరులు పాల్గొన్నారు.



అసిస్టెంట్ డైరెక్టర్ విజయలక్ష్మికి వినతి పత్రం అందిస్తున్న నాయకులు

మోడల్ స్కూల్‌లో అడ్మిషన్లు ప్రారంభం

కొత్తకోట రూరల్: మండలంలోని అమడబాకుల శివారులో గల మోడల్ స్కూల్‌లో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతిలో ప్రవేశం కోసం ఇటీవల నిర్వహించిన పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థుల నుంచి సంబంధిత పత్రాలను తీసుకుని పాఠశాలలో అడ్మిషన్లు ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌చారి, వైస్ ప్రిన్సిపాల్ నరేష్‌కుమార్ తెలిపారు. 6వ తరగతిలో 100 సీట్లకు గానూ ప్రస్తుతానికి 64మంది విద్యార్థులు చేరారని, మిగతా వారికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చామన్నారు. పదో తరగతిలో సాధించిన జీపీఏ ఆధారంగా ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో 40, బైపీసీ 40, సీఈసీ, 40, ఎంఈసీ 40 సీట్ల కేటాయింపు జరుగుతుందన్నారు.



అడ్మిషన్లు పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌చారి

వేగంగా రైస్ మిల్లులోని ధాన్యం తరలింపు

పాన్‌గల్: మండలంలోని మాందాపూర్ మీనాక్షి మిల్లులో మిరాసిపల్లి ఇషాన్ ఆగ్రో రైస్ మిల్లుకు సంబంధించిన వరి ధాన్యం నిల్వలను బుధవారం జిల్లా పౌరసరఫరాల శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంటు, రెవెన్యూ అధికారుల సమక్షంలో లారీల్లో తరలించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. గతంలో మిల్లులోని ధాన్యం నిల్వలను అధికారులు తరలించేందుకు ప్రయత్నించగా మిల్లు యజమాని కోర్టు నుంచి స్టే తెచ్చుకోవడంతో తరలింపు నిలిచి పోయింది. స్టే గడువు ముగియడంతో మిల్లులోని ధాన్యం నిల్వలను తరలిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. పౌరసరఫరాల శాఖ టెండర్ ద్వారా ధాన్యం నిల్వ బస్తాలను దక్కించుకుందని, అందులో భాగంగానే 500 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లు నుంచి లారీల్లో తరలిస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో పౌరసరఫరాల కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ బాలునాయక్, ఎన్‌ఫోర్స్‌మెంటు డీటీలు వేణు, నందకిశోర్, ఆర్‌ఐ మహేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



మిల్లులోని ధాన్యం బస్తాలను లారీల్లోకి ఎక్కిస్తున్న హమాలీలు

పుర వార్డులకు అధికారుల కేటాయింపు

ఆత్మకూర్: మున్సిపాలిటీ కేంద్రంలోని పది వార్డులకు గాను 10 మంది వార్డు అధికారులను కేటాయించామని, ఏ సమస్య వచ్చినా స్థానికులు నేరుగా ఫోన్ చేసి పరిష్కరించుకోవాలని కమిషనర్ నాగరాజు అన్నారు. ఒకటో వార్డు అధికారి రమాదేవి, సెల్ నంబర్ 79819 79161, రెండో వార్డుకు పావని 99488 90825, మూడో వార్డుకు కాశన్న 70323 47207, నాల్గో వార్డుకు భూపాల్ 78938 73139, ఐదో వార్డుకు శ్రీనివాసులు 91330 34143, ఆరో వార్డుకు విజయ్‌కుమార్ 91777 32824, ఏడో వార్డుకు రాములు 74161 83787, ఎనిమిదో వార్డుకు శివకుమార్ 83419 46151, తొమ్మిదో వార్డుకు మక్బూల్‌బిన్‌సయ్యద్ 73861 55003, పదో వార్డుకు ఆశన్న 91547 40919 నంబర్లకు సంప్రదించాలని సూచించారు. వార్డుల అధికారులు ప్రతినిత్యం అందుబాటులో ఉంటారని తెలిపారు.

అద్దెకు వ్యవసాయ పనిముట్లు

ఆత్మకూర్: మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో వ్యవసాయానికి అవసరమైన పనిముట్లు తక్కువ కిరాయితో అద్దెకు అందుబాటులో ఉన్నాయని, రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వెలుగు సిబ్బంది అన్నారు. రెండు ట్రాక్టర్ ఇంజన్లు, గుంటుక, రోటవేటర్, ట్రాలీ, నాలుగు కల్టివేటర్లు, కేజీవీల్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వివరాలకు 94936 91275, 87909 90783, 87909 90798 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

పెబ్బేరు రూరల్: గ్రామ పంచాయతీ వర్కర్లకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ వనపర్తి జిల్లా గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో బుధవారం కార్మికులు పట్టణ కేంద్రంలో ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్ గేటు వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ నాగేష్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్యాలు కాపాడుతూ తమ జీవితాలను పణంగా పెడుతున్న గ్రామ పంచాయతీ కార్మికులపై నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపుతుందన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు, రాము, హరీష్, వెంకటేష్, దాసు, రాములు, నాగన్న, నారాయణ, కిషన్‌నాయక్, సుగ్రీవుడు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

అండర్ డ్రెయినేజీ నిర్మించండి

అమరచింత: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వెనక నుంచి మాల వీధి వరకు ఉన్న పెద్ద చెరువు కాల్వ ద్వారా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, దోమలతో రోగాల బారిన పడుతున్నారని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న చెరువు కాల్వను తొలగించి వాటి స్థానంలో అండర్ డ్రెయినేజీని నిర్మించాలని కోరుతూ బుధవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. చెరువు నీరు వెళ్లడం కోసం అప్పట్లో కాల్వను నిర్మించారని, ప్రస్తుతం అదే కాల్వలో ఇళ్ల నుంచి వస్తున్న మురుగు పారుతుండడంతో కాల్వ పరిసరాలు దుర్గంధంగా తయారయ్యాయని తెలిపారు. కాల్వ తెరుచుకొని ఉండటంతో చిన్నారులు, వృద్ధులు కాల్వలో పడి ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమ సమస్యను పరిష్కరించే విధంగా అండర్ డ్రెయినేజీని నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో రాజన్న, నారాయణ, మహేందర్, రాంచందర్, నాగప్ప, కుమ్మరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న కాలనీవాసులు

విద్యార్థినికి సన్మానం

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో గతేడాది 10వ తరగతి చదివిన విద్యార్థిని రాధికను బుధవారం హెచ్‌ఎం సుధారాణితో పాటు ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. విద్యార్థిని 10వ తరగతి పరీక్షలో 9.2 జీపీఏ సాధించింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఎంచుకొని దానికి అనుగుణంగా చదవాలన్నారు. కార్యక్రమంలో సీఆర్పీ వెంకటేష్, అమ్మ ఆదర్శపాఠశాల చైర్‌పర్సన్ గీతా తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు